క్లుప్తంగా

న్యాయవాదుల విధులు బహిష్కరణ



నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

సుల్తానాబాద్: నిజామాబాద్ బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులు ఎర్రం గణపతి, బెలీఫ్, డిక్రీ హోల్డర్‌పై అక్రమంగా కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ సోమవారం సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల శ్రీరాములు ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల మేరకు కోర్టు అటాచ్‌మెంట్ ఎగ్జిక్యూట్ వారెంట్ నోటీసులు అందించేందుకు వెళ్లిన న్యాయవాదులపై అక్రమ కేసులు పెట్టిన జిల్లా కలెక్టర్‌ను సస్పెండ్ చేయాలని, అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల హక్కులను కాలరాసిన కలెక్టర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ స్థలం కోసం కలెక్టర్‌కు ఎమ్మెల్సీ లేఖ



కలెక్టర్‌కు లేఖ అందిస్తున్న నరేశ్

ధర్మారం: మండలంలోని కటికెనపల్లి గ్రామానికి మంజూరైన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌కు రాసిన లేఖను గ్రామానికి చెందిన రైతు నరేశ్ అందించారు. మండలంలోని బంజేరుపల్లికి 2018 ఆగస్టులో 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైంది. బంజేరుపల్లిలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో కటికెనపల్లి శివారులో ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని రెవెన్యూ అధికారులను కోరితే, రెవెన్యూ అధికారులు సమాధానం ఇవ్వలేదని, కలెక్టర్ స్పందించి కటికెనపల్లిలో ప్రభుత్వ భూమిని కేటాయించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖలో కోరారు.

సంపు నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలం పరిశీలిస్తున్న అధికారులు

రామగుండం: కార్పొరేషన్ 20వ డివిజన్ పరిధిలోని రైల్వేస్టేషన్ ఏరియా, భరత్‌నగర్, ఎస్టీ కాలనీల్లో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ఇటీవల కలెక్టర్ రూ. 8 లక్షల నిధులు మంజూరయ్యాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం డివిజన్ పరిధిలో పాత ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో సంపు నిర్మాణానికి రామగుండం తహసీల్దార్ జాహెద్‌పాషా, ఆర్‌ఐ రమ్య, సర్వేయర్ అశోక్, రాపోలు శశికుమార్ కార్పొరేషన్ కన్నూరి సతీశ్ కుమార్ తదితరులు స్థలం పరిశీలించారు.

కాలనీ వాసులకు అండగా ఉంటా



జనక్‌ప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

గోదావరిఖని: మంద కొమురమ్మ కాలనీ వాసులకు అండగా ఉంటామని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ హామీ ఇచ్చారు. సోమవారం స్థానిక మంద కొమరమ్మకాలనీ వాసులు ఆయనకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వాలు అణగారిన వర్గాల అభ్యున్నతికి సహకరించాలని, ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇప్పించేందుకు అండగా ఉంటానన్నారు. దళిత అధికారులు ఉన్నచోటనే దళితులకు సరైన న్యాయం జరగడం లేదన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు రాసపల్లి రవికుమార్, రాధ, కొండ్ర అరుణ, సరోజన, అంజలి, అర్చన, తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

ఓదెల: మండలంలోని కొలనూర్ శివాలయం పునర్‌నిర్మాణానికి గ్రామానికి చెందిన జీగురు రవీందర్ రూ.52,119 విరాళం దేవస్థానం కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. అనంతరం ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సామ మణెమ్మ, శంకర్, పురోహితులు నందగిరి అశోక్ పాల్గొన్నారు.

ఆఖిరి మజిలీకి అవస్థలు..

- వైకుంఠధామాల్లో కానరాని సౌకర్యాలు
- డంపు యార్డులుగా మారుతున్న వైనం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



నూతుల కుంట వద్ద శ్మశాన వాటిక

కమాన్‌పూర్: మండలంలో ఎవరైనా చనిపోతే దహనసంస్కారాలు చేయడానికి ఇబ్బందులు తప్పడం లేదు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రెండు వైకుంఠధామాల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో కొంత మంది వారి సొంత భూముల్లో, భూమిలేని వారు తప్పని పరిస్థితుల్లో వైకుంఠధామాల్లో అంతిమ సంస్కారాలు చేస్తున్నారు. పేరుకే మండల కేంద్రమైనా రెండు వైకుంఠధామాలు ఉన్నా చనిపోయిన వారి అంతిమ సంస్కారాలకు అవస్థలు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు.

కమాన్‌పూర్‌లో కొన్నేళ్ల క్రితం పిల్లిపల్లె వెళ్లే దారిలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నూతుల కుంటలో అప్పుడు శ్మశానవాటికను ఏర్పాటు చేయడానికి శ్రీకారం చుట్టారు. ఒడిదొడుకుల మధ్య నిర్మాణం పూర్తి చేసిన అక్కడ కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో పాటు వర్షాకాలంలో నూతులకుంటలోకి భారీగా వరదనీరు చేరితే శ్మశానవాటిక నీటిలో మునిగిపోతోంది. గ్రామంలో సేకరించిన చెత్తను, చికెన్ సెంటర్లలోని వ్యర్థాలను శ్మశానవాటికకు వెళ్లే దారిలో పడేస్తుండంతో చెత్తాచెదారంతో నిండిపోయి అది నిరుపయోగంగా మారింది.

ఈజీఎస్ నిధులతో నిర్మించిన శూన్యమే..

తెలంగాణ ప్రభుత్వం ఏర్పాడ్డాక ప్రతి గ్రామంలో వైకుంఠధామాలు ఏర్పాటు చేసింది. దీంతో మండల కేంద్రం నుంచి సిద్దిపల్లె గ్రామానికి వెళ్లే దారిలో ఉపాధిహామీ, పీఆర్ నిధులతో వైకుంఠ ధామాన్ని ఏర్పాటు చేశారు. అందులో వేసిన బోరు మోటార్ కాలిపోవడంతో నేటి వరకు మరో మోటార్ ఏర్పాటు చేయలేదు. దహన సంస్కారాలు చేయడానికి వెళ్లి వారు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో దహన సంస్కారాలు చేయడానికి ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వైకుంఠధామాల్లో సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు



నూతుల కుంట వద్ద ఏర్పాటు చేసిన స్మశానవాటికల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని పలుమార్లు గ్రామసభల్లో చర్చించిన పట్టించుకోవడం లేదు. కొద్ది రోజుల క్రింత శుభాష్‌నగర్‌కు చెందిన ఒకరు చనిపోతే దహనసంస్కారాలు చేయడానికి ఇబ్బందిగా ఉండంతో ట్రాక్టర్‌తో దారిలో ఉన్న చెత్తను తొలగించాను.

– పోతుల కుమార్, వార్డు సభ్యుడు కమాన్‌పూర్

సౌకర్యాలు కల్పిస్తాం



మండల కేంద్రంలోని వైకుంఠ ధామాలను పరిశీలించి అందులో ఉన్న సమస్యలను పరిశీలించి నీటి వసతి, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయడానికి తగు చర్యలు తీసుకుంటాం.

– విజయ్‌కుమార్, ఎంపీడీవో, కమాన్‌పూర్

ఓవర్‌లోడ్ తో కూలిన కల్వర్టు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మొట్లపల్లి శివారులో ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీలతో సోమవారం రాత్రి కల్వర్టు కూలిపోయింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇరువైపులా ఇసుక లారీలు నిలిచి పోయాయి. రాత్రిపూట కావడంతో మరోదారి లేక ప్రయాణికులు, వాహనాలు ఎక్కడికక్కడే నిలిచి పోయయాయి. వ్యవసాయ దారులు, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు దారిలేక ఇబ్బందులు పడ్డారు. రాత్రిపూట రాకపోకలు పునరుద్ధరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఫాతిమాషేక్ జయంతి

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని క్రిసెంట్ స్కూల్, రైజింగ్‌సన్ పాఠశాలలో సోమవారం తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమాషేక్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో పద్మహనుమయ్య ఫౌండేషన్ కార్యదర్శి ఎండీ.సాధిక్ సయ్యద్, అజీమ్, దుర్గయ్య, శేఖర్, అరుణ, శారద, వరలక్ష్మి పాల్గొన్నారు.

నర్సయ్యకు నివాళి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణానికి చెందిన కాంట్రాక్టర్ గంట నర్సయ్య ఆదివారం రోడ్డు ప్రమాదంలో మరణించగా, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు సోమవారం నర్సయ్య మృతదేహానికి నివాళి అర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మమతారెడ్డి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు నర్సయ్య కుటుంబసభ్యులను ఓదార్చారు.

ఆటగాళ్ల ప్రోత్సాహానికే క్రీడా ప్రాంగణాలు



పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చందర్

రామగుండం: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. సోమవారం అంతర్గాం మండల కేంద్రంలోని కేసీఆర్ కప్ కోరుకంటి రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. సమైక్య రాష్ట్రంలో క్రీడలను నిర్లక్ష్యం చేయడంతోనే క్రీడాకారులకు గుర్తింపు లేకుండా పోయిందన్నారు. అనంతరం ఫుట్‌బాల్ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి, సర్పంచులు కుర్ర వెంకటమ్మ, ఫుట్‌బాల్ టోర్నీ నిర్వాహకులు కుర్ర సన్నీ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బానోతు తిరుపతినాయక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిలువుటద్దం రామగుండం

జ్యోతినగర్: రాష్ట్రంలో అభివృద్ధికి నిలువుటద్దంలా రామగుండం నిలిచిందని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. సోమవారం కార్పొరేషన్ నాలుగో డివిజన్‌లో రూ. కోటి 30 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పై ప్రతిపక్ష నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ డాక్టర్ అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపల్లి అభిషేక్‌రావు, కమిషనర్ సుమన్‌రావు, కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కోల్‌సిటీ: 25వ డివిజన్‌లో రూ.65 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శంకుస్థాపన చేశారు.

కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత

గోదావరిఖని: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 129 మంది లబ్ధిదారులకు సోమవారం కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో మేయర్ అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ అభిషేక్ రావు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పాలకుర్తి: బసంత్‌నగర్‌లోని ఇండియా మిషన్ సెకండరీ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించినట్లు పాఠశాల పీఈటీ బొంకూరి లక్ష్మణ్ తెలిపారు. ఈనెల 8న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ గార్డెన్‌లో జపాన్ కరాటే అసోషియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి షోటోకాన్ కరాటే బెల్ట్ టెస్ట్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు డి.అభినవ్, అమన్‌సింగ్ పాల్గొని బ్లాక్‌బెల్ట్ సాధించారు. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థులకు ప్రిన్సిపాల్ మహేంద్రన్ బెల్టులు, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.

విద్యార్థినికి అభినందన

సుల్తానాబాద్: జిల్లా స్థాయి సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్ట్ లో సుల్తానాబాద్ సెయింట్ మేరీస్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని శ్రీహారిక జిల్లాలో రెండో స్థానంలో నిలిచింది. నిర్వాహకులు శ్రీహారికను అభినందిస్తూ మెరిట్ సర్టిఫికెట్, మెమొంటో అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తుమ్మ అశోక్ రెడ్డి విద్యార్థినిని అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఫాదర్ ప్రభాకర్, టీచర్లు పాల్గొన్నారు.

అలరించిన బొమ్మల కొలువు



బొమ్మలకొలువులో క్లబ్ సభ్యులు

గోదావరిఖని: సంక్రాంతి పురస్కరించుకుని సోమవారం స్థానిక ఇల్లెందు క్లబ్‌లో నిర్వహించిన బొమ్మల కొలువు ఆకట్టుకుంది. తెలంగాణా సంస్కృతీ, సంప్రదాయాలు ఉట్టిపడేలా బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. అష్టలక్ష్మీ, సంక్రాంతి లక్ష్మీ, దసరా, సమ్మక్క–సారలక్క, జనగామ గ్రామం ఇలా పలు అంశాలపై బొమ్మల కొలువు చేశారు. కార్యక్రమాన్ని డైరెక్టర్ సతీమణి ఎస్.పల్లవి ప్రారంభించగా, సేవా అధ్యక్షురాలు పద్మ, సవిత, శ్రీదేవి, కళ్యాణి, ప్రియదర్శిని, జయ, మాలతి పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతులు

రామగుండం: ప్రైవేట్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కుందనపల్లి లిటిల్ సిటిజన్ స్కూల్‌లో మ్యాథమెటిక్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పోటీల్లో ఎండీ.రేయాన్ (ప్రథమ),ఎ.అశ్విత్ (ద్వితీయ) బహుమతులు సాధించారు. వీరికి స్కూల్ హెచ్‌ఎం.కొమ్మిడి సమ్మిరెడ్డి, కరస్పాండెంట్ బోగ నాగరాజు, ఇన్‌చార్జి సలీం, పీటీడబ్ల్యూఏ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కన్నూరి లక్ష్మణ్‌రావు బహుమతులు అందించారు.

కార్మికసంఘం ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారం పర్మినెంట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మడిపల్లి రాజమౌళి తన పదవీకాలం ముగియడంతో సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. కేశోరాం సిమెంట్ కంపెనీలో 2021 జనవరిలో జరిగిన పర్మినెంట్ కార్మిక సంఘం ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా మడిపల్లి రాజమౌళి, అధ్యక్షుడిగా బయ్యపు మనోహర్‌రెడ్డి గెలుపొందారు. యూనియన్ కాలపరిమితి పూర్తవడంతో ప్రధాన కార్యదర్శి రాజమౌళి తన రాజీనామా పత్రాలను అధికారులకు అందజేసినట్లు పేర్కొన్నారు.

సేవా పురస్కారాలు అందజేత



భాస్కర్‌ను సన్మానిస్తున్న ఓరుగంటి ఆనంద్

సుల్తానాబాద్: కరీంనగర్ ఫిలిం భవన్ లో నిర్వహించిన కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొమురవెల్లి భాస్కర్ లక్ష్మి దంపతులు సావిత్రిబాయి పూలే సేవా పురస్కారంను అందుకున్నారు. రాష్ట్ర ఆహార భద్రత కమిటీ సభ్యులు ఓరుగంటి ఆనంద్, జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ ఫౌండర్, చైర్మన్ వి ఆర్ శ్రీనివాస్ రాజు భాస్కర్ దంపతులకు అవార్డు అందజేసి సత్కరించారు.

సుల్తానాబాద్: సావిత్రి బాయి పూలే జయంతి పురస్కరించుకుని కరీంనగర్‌లో జరిగిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన బండారి భాగ్యలక్ష్మి– సూర్య దంపతులకు ఉత్తమ సేవా పురస్కారాన్ని జీసీఎస్ వల్లూరి వల్లూరి ఫౌండేషన్ అధ్యక్షుడు ఐఆర్ శ్రీనివాస్ రాజ్ అందజేశారు. యాదవ్‌నగర్ లో శ్రీధర్మశాస్త్ర గోశాలను స్థాపించి గోవులకు చేస్తున్న సేవలకు గుర్తింపుగా అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సూర్యను ఫౌండేషన్ సభ్యులు అభినందించారు.

తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరణ

ముత్తారం: మండల తహసీల్దార్‌గా వరందన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన పద్మావతి కలెక్టరేట్‌కు బదిలీ కాగా, వరందన్ పాలకుర్తి నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. తహసీల్దార్‌కు సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానించారు.

నాయబ్ తహసీల్దార్లు..

సుల్తానాబాద్: మండల నాయబ్ తహసీల్దార్‌గా సదానందం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పాలకుర్తి నుంచి సుల్తానాబాద్ కు బదిలీపై రాగా, సుల్తానాబాద్ లో పనిచేస్తున్ననాయబ్ తహసీల్దార్ మల్లికార్జున్ రెడ్డి పెద్దపల్లికి బదిలీ అయ్యారు.

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండల నాయబ్ తహసీల్దార్‌గా మల్లికార్జున్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏలు కలిసి అభినందనలు తెలిపారు.

ఓదెల నయాబ్ తహసీల్దార్‌గా అనిల్‌కుమార్

ఓదెల: మండల నయాబ్ తహసీల్దార్‌గా సీహెచ్ అనిల్‌కుమార్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఇంతకుముందు పనిచేసిన ధీరజ్ కుమార్ కాల్వశ్రీరాంపూర్‌కు బదిలీ అయ్యారు. డీటీకి సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

గోదావరి తీరం పరిశీలన

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని గోలివాడ, విలేజీ అంతర్గాం గ్రామాల శివారులోని గోదావరినది తీరాన్ని సోమవారం రామగుండం సీఐ వై.చంద్రశేఖర్‌రెడ్డి సందర్శించారు. ఇటీవల రామగుండం సీఐగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తరువాత సర్కిల్ పరిధిలోని గ్రామాలు, పరిసరాలు తదితర అంశాలను తెలుసుకునేందుకు వచ్చారు. అంతర్గాం మండల కేంద్రంలో రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలను పరిశీలించిన సీఐ అక్కడి నుంచి నేరుగా గోదావరినది తీరం, సమ్మక్క, సారలమ్మ గద్దెల ప్రాంగణం, గ్రామాల హద్దులు, గోదావరినది బ్యాక్ వాటర్, పంపుహౌజ్, ఎల్లంపల్లి ప్రాజెక్టును పరిశీలించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. సీఐ వెంట అంతర్గాం, రామగుండం ఎస్సైలు బోగె సంతోష్‌కుమార్, బత్తుల శరణ్య, జాతర కమిటీ చైర్మన్ గీట్ల శంకర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు బాలసాని అంజయ్యగౌడ్, సర్పంచులు సతీశ్, ధర్ని రాజేశ్, ఇండిబిల్లి రవీందర్ తదితరులున్నారు.

అటెన్షన్ ప్లీజ్ — పొంచి ఉన్న ప్రమాదం..



రామగిరి: మండలంలోని లద్నాపూర్‌లో మంథని, పెద్దపల్లి ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న సింగిల్ ఫేజ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండడంతో ప్రమాదం పొంచి ఉంది. ట్రాన్స్‌పార్మర్ ఉన్న సమీపంలోని నూతన భవన నిర్మాణ పనులు సాగుతుండడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటు చేసుకుంటుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను పైకి బిగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: మల్లేశ్, లైన్‌మెన్, లద్నాపూర్
సెల్‌నంబర్ 83339 94663

కేజీబీవీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



యైటింక్లయిన్‌కాలనీ: కేజీబీవీ పాఠశాలలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్స్ సమస్యలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు అశోక్ అన్నారు. సోమవారం యైటింక్లయిన్‌కాలనీలోని కేజీబీవీలో వర్కర్లతో కలసి నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రథమ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. నాన్ టీచింగ్ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 11న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రథమ మహాసభకు నాన్ టీచింగ్ అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో నాగమణి, రజిని, రజిత, రాజ్యలక్ష్మీ,రజిత, శారద, స్వర్ణలత పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మధ్యాహ్న భోజన కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలి

పెద్దపల్లిరూరల్: మధ్యాహ్నభోజన కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలనిఏఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బాలరాజు డిమాండ్ చేశారు. పెద్దపల్లిలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. మెస్ చార్జీలు సరిపోవడం లేదని ప్రభుత్వానికి విన్నవిస్తే కేవలం 45 పైసలను పెంచడమేంటని ప్రశ్నించారు. ప్రతి విద్యార్థికి రూ.25 చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కమలారెడ్డి, రవీందర్, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి వీల్‌చైర్ అందజేత

సుల్తానాబాద్: మండలంలోని నీరుకుల్ల గ్రామానికి చెందిన దివ్యాంగురాలు ఆకుల స్వరూపకు రిటైర్డ్ హెచ్‌ఎం అల్లం భాగ్యలక్ష్మి సత్యనారాయణ దంపతులు సమకూర్చిన వీల్‌చైర్‌ను సోమవారం ఎంపీపీ బాలాజీరావు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ భాగ్యలక్ష్మి సత్యనారాయణ దంపతులు సామాజిక సేవ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త తుమ్మ రాజ్ కుమార్, ఏఈ వెంకట్ నారాయణ, గర్రెపల్లి సింగిల్ విండో చైర్మన్ సందీప్ రావు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

జూలపల్లి: మండల కేంద్రంలో దారబొయిన లస్మమ్మ, అబ్దుల్ రజాక్ ఇటీవల అనారోగ్యంతో పలువురు మృతి చెందగా, బాధిత కుటుంబాలను సోమవారం పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ పరామర్శించారు.ఆయన వెంట వార్డు సభ్యులు సతీశ్,అంకూస్,పెద్ది భరత్ లాల్ మహ్మద్ తదితరులు ఉన్నారు.

నూతన నియామకం

కోల్‌సిటీ: వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా గోదావరిఖనికి చెందిన అల్లెంకి లచ్చయ్య ఎంపికయ్యాడు. సోమవారం మంచిర్యాల జిల్లాలో జరిగిన కార్యక్రమంలో అల్లెంకి లచ్చయ్య ప్రమాణస్వీకారం చేశారు. లచ్చయ్యను పెద్దపల్లి, గోదావరిఖని, రామగుండం, యైటింక్లయిన్‌కాలనీలోని వాసవి క్లబ్ ప్రతినిధులు అభినందించారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

జ్యోతినగర్: క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎన్టీపీసీ రామగుండం స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు అలోక్ చంద్ర ఠాకూర్ అన్నారు. ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లో ఆదివారం రాత్రి జరిగిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎన్టీపీసీ సంస్థ విద్యుత్ ఉత్పత్తితో పాటు ఉద్యోగుల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తుందన్నారు. విద్యుత్ ఉత్పత్తి, ప్రభావిత గ్రామాల అభివృద్ధికి సంస్థ సామాజిక సేవా విభాగంలో నిధులను కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి బానేశ్వరరావు, కేఎస్ రావు, ఉద్యోగ గుర్తింపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఆరెపల్లి రాజేశ్వర్, పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌పై అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు

ధర్మారం: మండలంలోని బొట్లవనపర్తి మాజీ సర్పంచ్ పెంచాల రాజేశం తన పదవీకాలంలో అవినీతి పాల్పడినారని ఆరోపిస్తూ సోమవారం ఇదే గ్రామానికి చెందిన కర్రె లక్ష్మణ్, ఆకారి మహేశ్, రెడపాక శ్రీనివాస్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. తన పదవీకాలంలో మరుగుదొడ్ల బిల్లు 32 మంది లబ్ధిదారులకు బిల్లులను సొంతానికి వాడుకున్నాడని, ప్రభుత్వ బోర్‌వెల్‌ను సొంతానికి వాడుకుంటున్నారని ఆరోపించారు. రైతువేదిక భవనంలో మరుగుదొడ్డి నిర్మించి నీటి సౌకర్యం కల్పించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నేడు అవగాహన సదస్సు

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలోని రైతు భవన్‌లో మంగళవారం ఉదయం 10.30 గంటలకు విపత్తుల నివారణ చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నామని ఎంపీడీవో భూక్య యాదగిరి తెలిపారు. పదో బెటాలియన్ ఎన్డీఆర్‌ఎఫ్ బృందం ఇన్‌స్పెక్టర్ బిట్టుసింగ్ ఆధ్వర్యంలో సభ్యులు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, సామాజిక కార్యకర్తలు, రైతులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

వైభవంగా తిరుప్పావై వేడుకలు



మంగళహారతులు ఇస్తున్న భక్తులు

సుల్తానాబాద్: పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాలు కొనసాగుతున్నాయి. అర్చకులు శ్రావణ్ కుమార్ హరిణి దంపతుల ఆధ్వర్యంలో సోమవారం ఉదయాన్నే తిరుప్పావై కి చెందిన 30 పాశురాలను భక్తులతో కలిసి మనసంతానం చేశారు. మంగళ హారతులతో, పాటలతో మహిళలు తమ మొక్కులు చెల్లించుకున్నారు. గోదమ్మ తల్లికి సారే, ఒడి బియ్యం వేడుకలను కూడా భక్త బృందం సహకారంతో అత్యంత వైభవంగా జరుపుకున్నారు. భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు.

11న శ్రీగోదారంగనాయకుల పాయసోత్సవం

రామగిరి: మండలంలోని లద్నాపూర్ శ్రీదేవీ, భూదేవీ సహిత శ్రీ గోదారంగనాయకుల, శ్రీదాసాంజనేయ ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 11న పాయసోత్సవం(కోడారై) నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల శ్రీనివాసాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో 108 మంది నూతన దంపతులకు లేదా 108 మంది నూతన వధువులకు 108 గంగాళాల్లో పాయసం అందించనున్నట్లు వివరించారు. ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.